నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 19 డిసెంబర్ 2024 | RANGAREDDY



కొడంగల్‌లో..






బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశ రథ్‌నాయక్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కడ్తాల్ మండలంలో పర్యటించాలని కోరారు.

కడ్తాల్, డిసెంబర్ 18

## రైతులకు బెయిల్..
# హోరెత్తిన సంబురాలు

లగచర్ల ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో సహా 24 మందికి బెయిల్ మంజూరు

బాధిత కుటుంబాలు, బీఆర్‌ఎస్ శ్రేణుల హర్షం

న్యాయం గెలిచిందన్న బాధిత కుటుంబాల మహిళలు

సంబురాలు చేసుకున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

లగచర్ల ఘటనలో అరెస్టైన వారికి బెయిల్ మంజూరైంది. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో సహా మరో 24 మందికి బుధవారం నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రోటిబండతండా, పులిచెర్లకుంటతండా, లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాల్లోని బాధిత కుటుంబాల సభ్యులు, రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. గత నెల 11వ తేదీన ఫార్మా విలేజ్ భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్ల వెళ్లిన అధికారులను రైతులు అడ్డుకున్న విషయం తెలిసిందే.. కాగా, అదే రోజు అర్ధరాత్రి వారి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. కరెంట్ సరఫరా నిలిపివేసి, ఇంటర్నెట్ సేవలను బంద్ చేసి ఇల్లిల్లూ జల్లెడపట్టారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు అని చూడకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. ఆడ, మగ అనే తేడా లేకుండా దొరికిన వారిని దొరికినట్లుగా వ్యాన్లలో కుక్కి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆనాటి నుంచి ఆ 5 గ్రామాలు పూర్తిగా నిర్మానుష్యంగా మారి, బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. అరెస్టై జైలులో ఉన్న వారి పరిస్థితి ఏ విధంగా ఉందో తెలియక కుటుంబీకులు తిండి, నిద్ర మాని వారి కోసం ఎదురు చూస్తూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశాయి. కాగా, బుధవారం నాంపల్లి స్పెషల్ కోర్టు వారికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేయడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం నిండింది. తమ వారి కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు న్యాయం గెలిచిందని.. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ బాధిత కుటుంబాల సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేకు బెయిల్ రావడంతో నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు ఆనందంతో సంబురాలు జరుపుకొంటున్నారు. 36 రోజులుగా నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఎంతో బాధతో ఉన్నామని, బెయిల్ మంజూరు కావడంతో వారు కడిగిన ముత్యంలా బయటికి వస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

- కొడంగల్, డిసెంబర్ 18

### బెయిల్ మంజూరుతో ఆనందం..



నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిందని తెలియడంతో ఇంట్లోని అందరం సంతోషపడ్డాం. ఎప్పుడెప్పుడు వస్తారా అని వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నాం. జైలుకెళ్లిన నాటి నుంచి మా ఆయన ఎట్లా ఉన్నాడో తెలియక చాలా బాధగా ఉండేది. ఆయన ఆరోగ్యం కూడా బాగా లేదు. తొందరగా ఇంటికి రావాలని ఎన్నో దేవుళ్లను మొక్కుకున్నా.

–సుమిత్రాబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం



(ఫైల్)



మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్ రావడంతో షాబాద్ మండల కేంద్రంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కొడంగల్‌లో..

### తిండీనిద్ర లేదు..



లగచర్ల ఘటనలో తన కుమారుడిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి జైల్లో వేశారు. అప్పటి నుంచి సరిగ్గా తినడంలేదు.. కంటికి నిద్రలేదు. ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తున్నా. బుధవారం బెయిల్ మంజూరైందని తెలియడంతో సంతోషంగా ఉన్నది. ఒక్కగానొక్క కొడుకు ఏమైపోతాడో అనే భయంగా ఉండేది. మాకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు.

– సుశీలాబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం



# ఆన్‌లైన్ బెట్టింగ్‌లు..

బానిసలుగా మారుతున్న యువత

# అప్పుల పాలై.. ఆత్మహత్యలు

జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్కృతి రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ వ్యసనానికి యువత బానిసగా మారి అప్పులు తీసుకొచ్చి ఆటలాడి.. వాటిని తేర్చే మార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నది. జిల్లాలో పేకాటపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలు రంగంలోకి దిగాయి. పేకాటకు అలవాటు పడిన వారిని ఆకర్షిస్తున్నాయి. జిల్లాలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల వంటి పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో పెద్ద మొత్తంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు సమాచారం. లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు చేసిన యువత వాటిని తీర్చలేక.. వారు పెట్టే బాధలు భరించ లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నది. యువత జీవితాలను నాశనం చేస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టాలని బాధితుల తల్లిదండ్రులు పోలీసులను కోరుతున్నారు.

- రంగారెడ్డి, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ)

లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు.. వాటిని తీర్చే మార్గం లేక బలవన్మరణాలు

రంగారెడ్డి జిల్లాలో సుమారు 20 మంది ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బలి.. అరికట్టాలంటున్న పేరెంట్స్

### నిండు ప్రాణాలు బలి..

జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ యువత తమ నిండు ప్రాణాలను కోల్పోతున్నది. మంచాల మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఇటీవల పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని సంపాదించి రంగారెడ్డి కలెక్టరేట్‌లో పనిచేస్తున్నాడు. విధులు నిర్వహిస్తూనే ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి.. చేసిన అప్పులు తీర్చలేక తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలాగే, ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్, పోచారం గ్రామాలకు చెందిన యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడి.. తెచ్చిన అప్పులు తీర్చలేక లోన్ యాప్‌లు పెట్టే బాధలు భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. అలాగే.. ఓ ఇంజినీరింగ్ విద్యార్థి కూడా చేసిన అప్పులు తీర్చలేక ఇబ్రహీంపట్నం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శంషాబాద్, తుక్కుగూడ, కందుకూరు, మహేశ్వరం వంటి ప్రాంతాలకు చెందిన పలువురు యువకులూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలుగా మారి తనువులు చాలించారు. తాజాగా ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడి ఆత్మహత్య చేసుకున్నాడు.

### సర్వం కోల్పోతున్న యువత..

ఆన్‌లైన్ గేములు ఆడుతూ అనేకమంది యువకులు సర్వం కోల్పోతున్నారు. అదేపనిగా బెట్టింగ్ గేములు ఆడుతూ.. ఆస్తులనూ అమ్ముకుంటున్నారు. బెట్టింగ్‌లు ఆడేందుకు అప్పులు చేసిన వారు సకాలంలో వాటిని చెల్లించకపోవడంతో రుణాలు ఇచ్చిన సంస్థలు వేధింపులకు గురిచేస్తున్నాయి. వాటిని తట్టులేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

### యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు..



ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలి. యువత ఇలాంటి వ్యసనానికి బాలిస కావొద్దు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. యువతీ యువకుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

–కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ

## యువకుడి బలి..

- లక్షలాది రూపాయలు పోగొట్టుకుని...
- మనస్తాపంతో డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి..
- తులేకలాన్ గ్రామంలో ఘటన

ఇబ్రహీంపట్నం రూరల్, డిసెంబర్ 18 : ఆన్‌లైన్ బెట్టింగ్ గేములాడి ఓ యువకుడు తన జీవితాన్ని చాలించాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని తులేకలాన్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తులేకలాన్ గ్రామానికి చెందిన చెనమోని శివలింగం(28) అనే యువకుడు ఇబ్రహీంపట్నంలోని ఐడీఎఫ్‌సీ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు.కొంతకాలంగా అతడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో లక్షలాది రూపాయలు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురైన అతడు డిసెంబర్ 15న ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శివలింగం మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# సఫాయి కార్మికులకు పథకాలు అందేలా చూస్తాం

సఫాయి కార్మికుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్




మాట్లాడుతున్న సఫాయి కార్మికుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్

ఆదిబట్ల, డిసెంబర్ 18 : సఫాయి కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని సఫాయి కార్మికుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్ అన్నారు. బుధవారం రంగారెడ్డి కలెక్టర్‌లోని మీటింగ్ హాల్లో సఫాయి కార్మికులకు అధికారులు అమలు చేస్తున్న పథకాల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సఫాయి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. సఫాయి కార్మికులకు పునరావాసం కల్పిస్తూ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలన్నారు. జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సఫాయి కార్మికులకు వేతన స్లిప్పులు, పీ ఎఫ్, ఈఎస్ఐ, బీమా కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. మహిళా కార్మికులకు ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధానమంత్రి బీమాయోజన పథకంపైనా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామారావు, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి ప్రవీణ్‌రెడ్డి, మైనార్టీ శాఖ జిల్లా అధికారి నవీన్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రామేశ్వదీదేవి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు, సఫాయి కార్మికులు పాల్గొన్నారు.

### నేటి నుంచి బుక్ ఫెయిర్

చిక్కడపల్లి,డిసెంబర్18: ఎన్టీఆర్ స్టేడియంలో నేటి నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభమవుతుందని బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్ తెలిపారు. బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాకూబ్ మాట్లాడుతూ... ఈ నెల 19 నుంచి 29 తేదీ వరకు జరిగే బుక్ ఫెయిర్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు 210కి పైగా ప్రచురణ కర్తలు, డిస్ట్రిబ్యూటర్లు, పుస్తకాలను ప్రదర్శిస్తారని తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు బుక్ ఫెయిర్‌ను సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు ప్రారంభిస్తారన్నారు.